క్లుప్తంగా

బృందావన్ కాలనీలో కార్పొరేటర్ పర్యటన



మాట్లాడుతున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ బృందావన్ కాలనీలో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ఆదివారం పర్యటించారు. స్థానికంగా కొనసాగుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రవి యాదవ్, రవీందర్, రవి, వెంకటరమణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యప్రదర్శన



శిల్పారామంలో కూచిపూడి నృత్యాంశాలు

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం కూచిపూడి నృత్య ప్రదర్శన అలరించింది. శైలజప్రసాద్ శిష్యబృందం గణపతి కౌతం, కృష్ణజనన శబ్దం, రామాయణ శబ్దం, జతిస్వరం తదితర అంశాలను కళాకారులు లాస్య, సిరిమా, స్మృతి, గీత, శాన్వి, దీత్య తదితరులు అద్భుతంగా ప్రదర్శించారు.

ఆకట్టుకున్న చిరు ధాన్యాల ఆహార పండుగ



న్యాక్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన చిరుధాన్యాల పిండి వంటలు

మాదాపూర్: మాదాపూర్‌లోని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) గ్రౌండ్‌లో ఆదివారం నిర్వహించిన సైక్లోథాన్‌లో భాగంగా చిరు ధాన్యాల ఆహార పండుగ పేరిట స్టాల్స్ నిర్వహించారు. సైక్లిస్టులు, సందర్శకులు వివిధ రకాల చిరుధాన్యాలతో కూడిన వంటలను ఆరగించారు. స్టాల్స్ నిర్వాహకులు చిరుధాన్యాల ప్రత్యేకతను, వాటిని ఉపయోగించడం వల్ల కలిగే లాభాలను సందర్శకులకు వివరించారు. పిండి వంటలు. పచ్చళ్లు, ఆహార ధాన్యాలను విక్రయించారు.

వస్తు సేకరణకు విశేష స్పందన



పాత వస్తువులు, దుస్తులను సేకరిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ గ్రాండే గృహ సముదాయంలో గూంజ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వస్తు సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి గ్రాండే వాసుల నుంచి స్పందన లభించింది. అనాథల కోసం వస్తువులను అందజేసేందుకు పలువురు ముందుకు వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రాండే వాసులు వాడని వస్తువులతో పాటు చిన్నారులు, యువత, మహిళల డ్రెస్‌లను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఉత్తమ్ బెహరా, శంకరనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని కొడకంచి గ్రామంలోని ఆదినారాయణ స్వామి ఆలయ ఉత్సవాలకు సంబంధించి తైబజార్ పన్నులను జీపీ ఆధ్వర్యంలో వసూలు చేసుకుంటామంటూ కార్యదర్శి నోటీసు ఇవ్వడం సరికాదని ఆలయ ట్రస్ట్ చైర్మన్ రామాజీరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ ఆలయం దేవాదాయశాఖ పరిధిలో ఉందని, కార్యదర్శి నోటీస్ విషయంపై జిల్లా కలెక్టర్, డీపీఓలకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈఓ ఏకపక్షంగా వ్యవహరిస్తూ, ఉత్సవాలకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, డీపీఓ, డీఎల్‌పీఓ, ఎంపీడీఓలకు ఫిర్యాదు చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి తీరుపై న్యాయ పోరాటం చేస్తామన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటయ్యేనా?

- ఏళ్లుగా పటాన్‌చెరు వాసుల ఎదురుచూపులు
- సంగారెడ్డిలో పెరిగిన రిజిస్ట్రేషన్లు



పటాన్‌చెరులో రిజిస్ట్రేషన్ కార్యాలయం(ఫైల్)

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగుతోంది. అయితే వీటి రిజిస్ట్రేషన్ల కోసం తప్పని పరిస్థితుల్లో ఇక్కడి క్రయవిక్రయదార్లందరూ సంగారెడ్డి సమీపంలోని కంది మండల కేంద్రంలోని సంగారెడ్డి సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లక తప్పని పరిస్థితి నెలకొంది. పాత తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తారనే ప్రచారం సాగి ఏళ్లు గడుస్తున్నా నేటికీ ఏర్పాటు కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

- నియోజకవర్గం పరిధిలో మైహోం, డీఎల్ఎఫ్, శాంతా శ్రీరామ్ వంటి అనేక సంస్థలు ఇక్కడ ఆకాశహర్మ్యలు నిర్మిస్తున్నాయి. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు పట్టణాలుగా మారాయి. ఔటర్ రింగ్ రోడ్డు చుట్టూర ఉన్న గ్రామాలు మహానగరాలను తలపిస్తున్నాయి. రెండు వందల గజాల విల్లా ఇక్కడ రూ.కోటిన్నర నుంచి రూ.ఆరు కోట్ల వరకు పలుకుతోంది. అపార్ట్‌మెంట్‌లోని చిన్న ప్లాటు సైతం రూ.60 లక్షలకుపైగానే అమ్ముడుపోతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడుతున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. దేశంలోని వివిధ ప్రాంతాల వారు ఇక్కడ ఆవాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఇక్కడ రియల్ వ్యాపారం జోరుగా సాగుతోంది.
- గతంలో పటాన్‌చెరులో వారానికి ఒకసారి ఓ భవనంలో తాత్కాలికంగా రిజిస్ట్రేషన్లు జరిగేవి. కాని నియోజకవర్గంగా ఏర్పడిన తర్వాత ఆ తాత్కాలిక కార్యాలయాన్ని రద్దు చేశారు. సంగారెడ్డి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. పటాన్‌చెరులో కార్యాలయం ఏర్పాటైతే క్రయవిక్రయదార్లకు సౌకర్యంగా ఉంటుంది. సంగారెడ్డి నియోజకవర్గంలో ఇప్పటికే రెండు సబ్ రిజిస్ట్రేషన్(సంగారెడ్డి, సదాశివపేట) కార్యాలయాలు ఉన్నాయి. కాని పటాన్‌చెరులో మాత్రం లేదు.

> **కందికి వెళ్లాల్సి వస్తోంది**
>
> 
>
> ప్లాట్లు, ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లే కాకుండా వివిధ సంస్థలు సైతం రిజిస్ట్రేషన్ల కోసం కంది గ్రామానికి వెళ్లాల్సి వస్తోంది. జాతీయ రహదారిపై ప్రయాణం ఇబ్బందికరంగా ఉంది. స్లాట్‌బుక్ చేసుకున్నప్పటికీ అక్కడ సకాలంలో రిజిస్ట్రేషన్లు కావడం లేదు. ఇలా రిజిస్ట్రేషన్ల కోసం కందికి వెళ్లే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోంది. పటాన్‌చెరు కేంద్రంలోనే రిజిస్ట్రేషన్ కార్యాలయం ఏర్పాటు చేయాలి.
>
> – రాజగోపాల్ యాదవ్, పటాన్‌చెరు
>
> **ఎలాంటి సమాచారం లేదు**
>
> పటాన్‌చెరులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు అంశం మా దృష్టిలో లేదు. గతంలో అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. అయితే కార్యాలయ ఏర్పాటు విషయంపై మాకు అధికారికంగా ఎలాంటి సమాచారం లేదు. ప్రతిపాదనలు ఎక్కడున్నాయి, ఏ దశలో ఉన్నాయనే వివరాలేవీ మా వద్ద లేవు.
>
> – రవీందర్ రావు, జిల్లా రిజిస్ట్రార్, సంగారెడ్డి

సీఎం సహాయనిధితో పేదలకు భరోసా



సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

హఫీజ్‌పేట్: సీఎం సహాయనిధి పేదలకు ఆర్థిక భరోసా ఇస్తోందని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ అన్నారు. శేరిలింగంపల్లిలో అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న హఫీజ్‌పేట్ డివిజన్‌లోని ఇంద్రారెడ్డి ఆల్విన్‌కాలనీ చెందిన నర్సింహస్వామికి మీంజూరైన సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ ని ఆదివారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ సీఎం సహాయనిధి ఆపదలో ఉన్నవారిని ఆపన్నహస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యానికి గురై ఆర్థిక స్థోమత లేక ఆస్పత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు అండగా నిలుస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గణేష్ ముదిరాజ్, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వరరావు, దామోదర్‌రెడ్డి, యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్

రాయదుర్గం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడలో ప్రదర్శించారు. బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్, గచ్చి బౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ తదితరులు కార్యక్రమాన్ని తిలకించారు. స్థానిక బీజేపీ సీనియర్ నాయకులు రంజిత్‌సింగ్ నివాసంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రొజెక్టర్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మన్ కీ బాత్ కార్యక్రమాన్ని అందరూ తిలకించేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పార్టీ పరిస్థితి, తదితర అంశాలపై నాయకులతో చర్చించారు. పార్టీని పటిష్టం చేయాలని, వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ శేరిలింగంపల్లి కన్వీనర్ రాఘువేందర్‌రావు, నాయకులు రాధాకృష్ణయాదవ్, వరలక్ష్మీ, విఠల్, కిషన్, వెంకటేష్, తిరుపతి, శివసింగ్, మహేశ్వరి, రంజిత్‌సింగ్, దేవేందర్‌రెడ్డి, సంతోష్‌సింగ్, శ్రీకాంత్ రెడ్డి, గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, ఉమేష్, బబ్లూ,సింగ్, ముత్యంరెడ్డి, అరవింద్‌సింగ్, ప్రదీప్‌గౌడ్, రాజ్‌సింగ్, నర్సింగ్‌రావు, శంఖేష్‌సింగ్ పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన గచ్చిబౌలి విద్యార్థులు

రాష్ట్ర స్థాయి పోటీల్లో 3 గోల్డ్, 3 సిల్వర్, 7 బ్రాంజ్ పతకాలు



పతకాలు సాధించిన గచ్చిబౌలి విద్యార్థులు

గచ్చిబౌలి: కరాటే రాష్ట్ర స్థాయి పోటీల్లో గచ్చిబౌలి విద్యార్థులు సత్తాను చాటారు. వివిధ విభాగాల్లో మూడు గోల్డ్ మెడల్స్, మూడు సిల్వర్, ఏడు బ్రాంజ్ పతకాలు సాధించడం విశేషం. స్వేచ్ఛ గోల్డ్ ఒక బ్రాంజ్, పూజ గోల్డ్, బ్రాంజ్, సామ్య గోల్డ్, బ్రాంజ్, సాయిచరణ్ ఒక సిల్వర్, ఒక బ్రాంజ్ పతకం, దేబాశీష్ సిల్వర్, బ్రాంజ్, అభిషేక్ బ్రాంజ్, , చైతన్య బ్రాంజ్, ఆదిత్య సిల్వర్ పతకాలను సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులను కరాటే మాస్టర్లు, ఇతర సీనియర్ క్రీడాకారులు అభినందించారు. జాతీయ స్థాయి పోటీలలో కూడా రాణించాలని సూచించారు.

వైభవంగా రంగనాథుడి బ్రహ్మోత్సవాలు



బాలభోగం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని చారిత్రక రంగనాథస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాదాయశాఖ, రంగనాథ మందిర్‌రంగ్ భాగ్ ట్రస్ట్ పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయంలో బాలభోగం, అర్చన, బలిహరణ, ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సామూహిక విష్ణు సహస్రనామార్చన చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో స్వామి వారి పల్లకి సేవా కార్యక్రమాన్ని భక్తుల జయజయధ్వానాల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన చైర్మన్ మేనేజింగ్ ట్రస్టీ శరద్‌బిపిట్టి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె అంజయ్య, ఆలయ అర్చకులు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా కోనసీమ జాతర

- వేడుకగా ప్రభల తీర్థం
- అపర్ణ సరోవర్‌లో సందడి





శివపార్వతులను ప్రభల్లో ఊరేగిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నల్లగండ్లలోని అపర్ణ సరోవర్‌లో ప్రభల తీర్థం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. దీంతో అపర్ణ సరోవర్‌లో గ్రామీణ వాతావరణం కనిపించింది. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే తిరనాళ్లు, గ్రామీణ వంటకాలు, క్రీడలు తదితర దృశ్యాలు కనిపించాయి. 400 ఏళ్లుగా కోన సీమలో ఈ వేడుకలను నిర్వహించే సంప్రదాయం కొనసాగుతుందని సరోవర్ వాసులు పేర్కొన్నారు. ఏకాదశ రుద్రులను ఒకే చోట చేర్చి పూజించడం వేడుకల ప్రాధాన్యతగా వివరించారు. శివపార్వతులను ప్రభల్లో ఆసీనులను చేసి ఊరేగించారు. ఊరేగింపులో చిన్నారులు, సరోవర్ వాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. చిన్నారుల దేవతా మూర్తుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ప్రభల తీర్థం విశిష్టత...

కోన సీమలో ప్రభల తీర్థం వేడుకలకు 400 ఏళ్ల చరిత్ర ఉందని అపర్ణ సరోవర్ వాసులు పేర్కొన్నారు. జగ్గన్నతోట వద్ద నిర్వహించే ఈ వేడుకలకు 11 గ్రామాల నుంచి ప్రభలు తరలి వస్తాయి. ఈ ప్రభలన్నీ జగ్గన్నతోట వద్ద కలిసి తీర్థం జరిపిన తర్వాత ఆయా గ్రామాలకు తిరిగి వెళ్తాయని నిర్వాహకులు చందన వివరించారు.

ఈశ్వరుని రూపంగా ప్రభల తీర్థం...

కోన సీమలో ఈశ్వరుడి రూపంగా ప్రభలను కొలుస్తారు. వెదురు కర్రలు, రంగు,రంగుల నూతన వస్త్రాలు, కాగితాలతో ప్రభలను తయారు చేస్తారు. అనంతరం వివిధ రకాల పూలతో అలకరించి శివ పార్వతులను కొలువుదీర్చి అపర్ణ సరోవర్‌లో బ్లాక్‌ల వారీగా ఊరేగించారు. మహిళల కోలాటాలు, హరహర మహాదేవ నినాదాలు మిన్నంటాయి. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

క్రీడలకు సంపూర్ణ సహకారం



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: క్రీడల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన జీఎంఆర్ ఓపెన్ టు ఆల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏడాది పొడవునా వివిధ క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. చదువు, శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం కోసం క్రీడలు అవసరమన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచితే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న టోర్నమెంట్‌లో 32 జట్లు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, మైత్రి క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, క్రైం సీఐ బీసన్న, జాతీయ వాలీబాల్ అంపైర్లు అమేర్, శ్రీనివాస్ రెడ్డి, మహేందర్, ముస్తఫా, నిర్వాహకులు యంజాల్ సాయి, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

జిన్నారం(పటాన్‌చెరు): మాదారం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న మల్లికార్జున స్వామి ఆలయ నిర్మాణానికి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్‌గౌడ్ రూ.1.16లక్షలను విరాళంగా అందించారు. ఆదివారం ఆయన ఈ మొత్తాన్ని ఆలయ బాధ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్ నాయకులు రాజుగౌడ్, సీతారాంసింగ్, కుమార్, రాజేందర్‌సింగ్, భజరంగ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి

పటాన్‌చెరు టౌన్: మేదరి మహేంద్ర దుకాణదారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సంఘం జిల్లా అధ్యక్షుడు అంబదాస్ అన్నారు. ఇంద్రేశం గ్రామ సమీపంలో ఆదివారం పటాన్‌చెరు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నంది కంటి నర్సింలు, అధ్యక్షుడిగా లోక్‌దాస్, కార్యదర్శిగా పాతకోటి భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా పోతుల మల్లేష్, కోశాధికారిగా శేఖర్‌ను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ దుకాణదారులు ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. కార్యక్రమంలో మేదరి మహేంద్ర సంఘం, వెదురు బొంగుల దుకాణదారులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత

పటాన్‌చెరు టౌన్: ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మనసుకు ప్రశాంతత లభిస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం స్థానిక మహంకాళి ఆలయంలో అఖండ హరి కీర్తన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సంకీర్తనలో ఆయన పాల్గొని పూజలు చేశారు. హరేరామ హరేకృష్ణ సంకీర్తనలతో 24 గంటలపాటు భగవంతుడి సన్నిధిలో గడపటం మంచి విషయమన్నారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు తాను ఎప్పుడు ముందుంటానని, ఎటువంటి సహకారం కావాలన్నా అందిస్తానని తెలిపారు. అనంతరం నిర్వాహకులు నీలం మధును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కిషన్ ప్రసాద్, సంతోష్ సింగ్, ధనుష్ శర్మ, మనోజ్ కుమార్, మున్నా యాదవ్, అయోధ్య, లలన్ సింగ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండలో నిరుపేద కుటుంబానికి చెందిన సీహెచ్ వరలక్ష్మికి హోప్ ఆఫ్ హంగర్ సంస్థ అందజేసిన నెలకు సరిపడా నిత్యావసరానలు ఆదివారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగ వరలక్ష్మీ కుమారుడు దైవ ప్రసాద్ అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడని అతని చికిత్స నిమిత్తం తన వంతు సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, వాసుదేవరావు, కృష్ణం నాయుడు, ఐలయ్య గౌడ్, రవికిరణ్, వెంకటేశ్వరరావు, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని శెట్టిబలిజల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక బంగారుగడ్డ వద్ద ఏర్పాటు చేసిన శెట్టిబలిజల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో శెట్టిబలిజలకు ప్రాధాన్యం కల్పిస్తామని, సొంత నిధులతో బంగారుగడ్డ పరిధిలో 600 గజాల స్థలాన్ని కేటాయిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

'ఆరు నెలల్లో బీఆర్ఎస్ గద్దె దిగడం ఖాయం'

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి డివిజన్ బిర్లా ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు ఆదివారం బీజేపీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి బీజేపీ నాయకుడు రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. రానున్న ఆరు నెలల్లో బీఆర్ఎస్ పార్టీ ఇంటికి పోవడం ఖాయమన్నారు. వారి పాలనతో ప్రజలు విసుగెత్తి పోయారని తెలిపారు. నేటి తెలంగాణ ప్రభుత్వానికి కబ్జాలపై ఉన్న దృష్టి అభివృద్ధి పైన లేదన్నారు. ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కి కొత్త స్కీములు తెచ్చి ప్రజలను ప్రలోభ పెట్టి మళ్లీ అధికారం చేజిక్కించుకోవాలని చూస్తోందన్నారు. ప్రజలు దీనిని గమనించి జాగ్రత్తగా ఆలోచించి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

- శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీజేపీ ప్రజలకు మరింత చేరువవుతోందని పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారికి తమ అండదండలు, పూర్తి సహకారం ఉంటాయన్నారు. ముమ్ముందు మరిన్ని చేరికలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించారు. కార్యకర్తలు ఎప్పుడు ప్రజల్లో ఉంటూ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి, బీజేపీ నాయకులు గోపాల్‌రావు, వేణు, బుల్లెట్ రవి, భార్గవి, విజయ్‌రెడ్డి, రేణుక, శ్యామల, నియోజకవర్గ కన్వీనర్ రాఘవేంద్రరావు, కో–కన్వీనర్ మణిభూషణ్, డివిజన్ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే మహాబలం

- ఆత్మస్థైర్యంతో సమస్యలను ఎదుర్కోవాలి
- ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదు
- రాష్ట్ర ప్రణాళికాసంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్
- గచ్చిబౌలి శాంతిసరోవర్‌లో స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సదస్సు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్

రాయదుర్గం: ఆత్మవిశ్వాసమే మహాబలమని, ఆత్మస్థైర్యంతో సమస్యలను ఎదుర్కోవాలని రాష్ట్ర ప్రణాళికాసంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. గచ్చిబౌలి బ్రహ్మ కుమారీస్ సంస్థ ఆధ్వర్యంలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్–నేను సైతం(ఆత్మహత్యల నివారణ సంస్థ) ఆదివారం ప్రత్యేక సదస్సు నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ సమస్యలు మనుషులకే వస్తాయని, ఎలాంటి సమస్యలైనా వివేకంతో, ఆత్మస్థైర్యంతో, ఆత్మవిశ్వాసంతో పరిష్కరించుకోవచ్చన్నారు. సమస్యలను ధీటుగా ఎదుర్కోవాలని, ఎట్టి పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడకూడదని పిలుపునిచ్చారు. పిల్లల పట్ల వారి తల్లిదండ్రులు స్నేహపూర్వకరంగా ఉండాలని పిల్లల మనస్తత్వాన్ని గమనించి వారికి ఎప్పటికప్పుడు ధైర్య సాహసాలను నింపాలని సూచించారు. ప్రేమ విఫలమైనా, పరీక్షల్లో తప్పినా ఇతర ఎలాంటి సమస్యలు వచ్చినా ధైర్యంతో ఎదుర్కోవాలని, ఈ సమయంలో పిల్లల తల్లిదండ్రులు, స్నేహితులు క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్పందన ఈద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు చైతన్య కార్యక్రమాలను చేపట్టాలన్న ఆలోచన ఉందని, ఈ విషయంలో త్వరలో ఒక నిర్ణయాన్ని తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ ఈద శామ్యూల్‌రెడ్డి, ప్రతినిధులు ప్రొఫెసర్ విశ్వనాథం, కులకర్ణి, డాక్టర్ ఉషాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.